మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పి వకుల్ జిందాల్ వాహనదారులను హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవ్వడం లేదా ఇతర వాహనాలను ఢీ కొట్టి ప్రమాదాలకు కారకులవుతున్నారని అన్నారు. ఇటువంటి వాహనదారులను కట్టడి చేసేందుకు ప్రతీ రోజూ నిర్వహిస్తున్న విజిబుల్ పోలీసింగులో ప్రత్యేకంగా డ్రైవ్ చేపడుతున్నామన్నారు. గజపతినగరం సిఐ జి.ఎ.వి.రమణ ఆధ్వర్యంలో నవంబరు 9, 10 తేదీల్లో గజపతినగరం, బొండపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఆరుగురిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. వీరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా గజపతినగరం జె.ఎఫ్.సి.ఎమ్ మెజిస్ట్రేట్ కనక మహాలక్ష్మి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం రూ. 60 వేలు జరిమానా విధించారని ఎస్పి తెలిపారు.

కమిషనర్ల ఖాతాల్లో మూలుగుతున్న నిధులు

- 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైనా ఖర్చు చేయని వైనం
- బకాయిలు కోసం కాళ్లరిగేలా తిరుగుతున్న కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

'తిన్నది అరగక ఒకరు ఏడిస్తే.. తిండి లేక మరొకరు ఏడ్చారట!' అలా ఉంది రాష్ట్రంలో మున్సిపాలిటీల పరిస్థితి. డబ్బులు లేక అభివృద్ధి పనులు చేయలేని మున్సిపాలిటీలు ఉన్నాయి. అటువంటిది కేంద్రం 15 వ ఆర్థిక సంఘం నిధులు ఆగస్టులో రాష్ట్రంలోని అన్ని పురపాలక సంఘాలకు 2023-24 సంవత్సరానికి విడుదల చేసింది. ఈ నిధులు కమిషనర్ల బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. నేటికీ ఆ డబ్బులు ఖాతాల్లో మూలుగుతున్నాయి. కానీ నగర, మున్సిపల్ కమిషనర్లు ఈ నిధులను ఖర్చు పెట్టలేదు. విజయనగరం నగర పాలక సంస్థ కమిషనర్ ఖాతాకు రూ.8.30 కోట్లు జమ అయినట్లు తెలిసింది. అయితే రాష్ట్ర మున్సిపల్ అధికారులు ఈ నిధుల ఖర్చుపై తేల్చకుండా నాన్చుతున్నారు. మరో వైపు రాష్ట్రంలో అన్ని పురపాలక సంఘాల్లో 15వ ఆర్థిక సంఘం ద్వారా 2021-22 సంవత్సరాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. విజయనగరం నగర పాలక సంస్థ లో వాటర్ ట్యాంక్‌లు, గార్బేజి ట్రాన్స్‌పోర్టు కేంద్రాలు, రోడ్లు, కాలువలు వంటి పనులు చేపట్టారు.ఈ పనులకు సంబంధించి రూ.3.50 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా రూ.120 కోట్లు బకాయిలు ఉన్నాయి. బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారోనని కాంట్రాక్టర్లు ఎదురు చూస్తున్నారు. ఇలాంటి తరుణంలో కేంద్రం 15 వ ఆర్థిక సంఘం నిధులు 2023-24 సంవత్సరానికి విడుదల చేసింది. ఈ డబ్బులు 2021-22లో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు కాళ్ళరిగేలా మున్సిపల్ కార్యాలయాల చుట్టూ, రాష్ట్ర కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. చివరకు మంత్రిని, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శులను కలిసి పాత బకాయిలు చెల్లించే విధంగా ఆదేశాలివ్వాలని కోరుతున్నారు. దీనికి మున్సిపల్‌శాఖా మంత్రి నారాయణ స్పందిస్తూ పాత బకాయిలు చెల్లించాలని ఆదేశించినట్లు తెలిసింది. అయితే రాష్ట్ర మున్సిపల్ ప్రిన్సిపల్ కార్యదర్శులు 25రోజుల్లో ముగ్గురు మారడంతో ఎప్పుడు ఆదేశాలు వస్తాయి? తమ బిల్లులు ఎప్పుడు జమవుతాయి అని కాంట్రాక్టర్లు ఎదురుచూస్తున్నారు. పాత బకాయిలు చెల్లిస్తే తప్ప కొత్త పనులను చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు వచ్చే పరిస్తితి కనిపించడం లేదు. 2021-22 లో పూర్తి చేసిన పనులకు ఇప్పటి వరకు బిల్లులు చెల్లించకపోవడం వలన అప్పు చేసి తెచ్చిన డబ్బులకు వడ్డీలు తలకు మించిన భారంగా మారుతున్నాయని కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 15 వ ఆర్థిక సంఘం ద్వారా చేసిన పనులకు చెల్లించేలా కమిషనర్లకు ఆదేశాలు ఇవ్వాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు 'సంకల్పం'

డిఐజి గోపీనాథ్ జట్టి ● మెడికల్ కళాశాలలో డ్రాప్ బాక్సులు ఏర్పాటు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జీవితాలను నాశనం చేసే మాదక ద్రవ్యాలను 'సంకల్పం'తో నియంత్రించాలని విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి అన్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలను యువతకు వివరించి, వారిని చైతన్యపర్చి, వాటిపై పోరాటం చేసేందుకు జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సంకల్పం' కార్యక్రమాన్ని మంగళవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాలను నియంత్రించేందుకు రూపొందించిన 100రోజుల ప్రణాళికలో భాగంగా పోలీసుశాఖ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రతీరోజూ చర్యలు చేపడుతుందన్నారు. ఇటీవల కాలంలో 10 వేల ఎకరాల్లో గంజాయి పంటను నాశనం చేసి, 3వేల మందిని అరెస్టు చేసామన్నారు. గంజాయి పండించే రైతుల జీవనోపాధికి పెద్ద పీట వేస్తూ, ప్రత్యామ్నాయ పంటలను పండించేందుకు విత్తనాలను, మొక్కలను ఏజన్సీ ప్రాంతాల్లో ఉచితంగా అందించామన్నారు. మాదక ద్రవ్యాలకు నియంత్రణకు అరెస్టుల కంటే అవగాహన కల్పించేందుకు ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం అన్నది ఒకరి సమస్య కాదని, వాటిని నియంత్రించే బాధ్యత ప్రతీ పౌరునిపై ఉందన్నారు. సోషల్ మీడియాలో వచ్చే సందేశాల్లో వాస్తవాలను నిర్ధారించుకోకుండా ఆయా సందేశాలను ఇతరులకు పంపడం నేరమన్నారు.

ఎస్పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ డ్రగ్స్ నియంత్రణ సమాజానికి పెద్ద ఛాలెంజ్ గా మారిందన్నారు. మాదక ద్రవ్యాలను నియంత్రించేందుకు అరెస్టులు చేపట్టేకంటే అవగాహన కల్పించడంతోనే నిర్మూలించ వచ్చునని భావించి యువతలో చైతన్యం తీసుకు వస్తున్నట్లు తెలిపారు. గంజాయి అక్రమ రవాణ, వినియోగం, విక్రయాలు తీవ్రమైన నేరమన్న విషయాన్ని యువత గుర్తించాలన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల మాట్లాడుతూ డ్రగ్స్ రహిత రాష్ట్రం, దేశంగా మార్చేందుకు అందరూ సంఘటితమై మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను వివరించి, అవగాహన కల్పించి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. అప్పల నాయుడు మాట్లాడుతూ - మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన వారికి చికిత్సను అందించే కంటే వాటి బారిన పడకుండా అవగాహన కల్పించడమే ప్రధానమని అన్నారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలను నియంత్రించుటలో భాగంగా వైద్య కళాశాల విద్యార్థులు, ప్రొఫెసర్లు, యాజమాన్యం, స్థానిక సిఐతో యాంటీ డ్రగ్స్ కమిటీని ఏర్పాటు చేసారు. మాదక ద్రవ్యాలపై యువతకు, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన బ్రోచర్‌ను విద్యార్థులకు అందజేసారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని, తమ చుట్టూ ఉన్న వారిని కూడా మాదక ద్రవ్యాలకు దూరం చేసేందుకు తమవంతు కషి చేస్తామని విద్యార్థులతో విజయనగరం డిఎస్పి ఎం.శ్రీనివాసరావు ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల విద్యార్థులను డ్రగ్స్ వినియోగం, కలిగివున్న వారి సమాచారం అందించేందుకు కళాశాలలో డ్రాప్ బాక్సులు ఏర్పాటు చేసారు డ్రగ్స్ పట్ల అవగాహన కలిగిన కళాశాలగా ధ్రువపరుస్తూ సర్టిఫికేటు అందజేశారు. టాస్క్‌ఫోర్స్ సిఐ బి.వెంకట రావు, ప్రభుత్వ సైక్రియాటీ హెచ్ఒడి డాక్టర్ మల్లిక, డిఎస్పి ఎం.శ్రీనివాసరావు, సిఐలు టి.శ్రీనివాసరావు, ఎవిలీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, సూరినాయుడు, ఇ.నర్సింహమూర్తి, బి.లక్ష్మణరావు, ఎల్.అప్పలనాయుడు, బి.లలిత, ఎస్ఐలు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డిఐజి, ఎస్పి తదితరులు

ఆక్వా హబ్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర పశుసంవర్ధకశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్

ఆక్వా హబ్‌ను పరిశీలించిన ఎంఎం నాయక్

ప్రజాశక్తి-వంగర

మండలంలోని సంకిలి గ్రామం వద్ద రూ.కోటి రూపాయలతో నిర్మిస్తున్న ఆక్వా హబ్‌ను, రాజాం మండలం బొద్దూరు గ్రామం వద్ద రూ.20లక్షలతో నిర్మిస్తున్న లైవ్‌ఫిష్ వెండింగ్ యూనిట్‌ను మంగళవారం రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ పరిశీలించారు. చేపల ఉత్పత్తులను వినియోగదారులకు మరింత చేరువచేయాలని, తద్వారా సగటు చేపల వినియోగాన్ని పెంచి స్వర్ణాంధ్ర లక్ష్యాలు సాధించాలని ఆశాఖ ఉద్యోగులకు, సిబ్బందికి సూచించారు. యూనిట్ల లబ్ధిదారులను వివరాలు అడిగి గ్రౌండింగ్ పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఎం నాయక్ వెంట మత్స్యశాఖ జిల్లా అధికారి ఎన్.నిర్మలాకుమారి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.ఏకలవ్య, మత్స్యశాఖ అధికారులు వెంకటేశ్వరరావు, ప్రసాద్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మూడు నామినేషన్లకు ఆమోదం

ప్రజాశక్తి-విజయనగరంకోట

స్థానిక సంస్థల శాసన మండలి ఉప ఎన్నికలకు నామినేషన్ పత్రాల పరిశీలన రిటర్నింగ్ అధికారి సేతు మాధవన్, ఎన్నికల పరిశీలకులు ఎమ్ఎం నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో జరిగింది. పరిశీలన అనంతరం ముగ్గురు అభ్యర్థుల నామినేషన్ పత్రాలను ఎటువంటి అభ్యంతరాలూ లేనందున వాలిడ్ గా జేసీ ప్రకటించారు. అభ్యర్థుల వివరాలను నోటీస్ బోర్డులో పెడతామని తెలిపారు. అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు ఈనెల 14 మధ్యాహ్నం 3 గంటల వరకు సమయం ఉందని తెలిపారు. అనంతరం పోటీలో ఉండే తుది అభ్యర్థుల జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. శాసనమండలి స్థానిక సంస్థల నియోజకవర్గ ఉప ఎన్నిక కోసం సోమవారం మధ్యాహ్నం మూడు గంటలతో నామినేషన్ల గడువు ముగిసింది. మొత్తం ముగ్గురు అభ్యర్థులు 5 నామినేషన్లు దాఖలు చేసినట్లు జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎస్.సేతు మాధవన్ వెల్లడించారు. ఎస్ కోట మండలం బొడ్డవరకు చెందిన ఇందుకూరి సుబ్బలక్ష్మి ఇండిపెండెంట్ అభ్యర్థిగా రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఎస్ కోట మండలం వసి గ్రామానికి చెందిన కారుకొండ వెంకటరావు ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. వైసిపి అభ్యర్థిగా శంబంగి వెంకట చినప్పల నాయుడు 2 సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. పరిశీలన కార్యక్రమంలో డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, ఎన్నికల విభాగం సిబంది, అభ్యర్థుల తరపు ప్రతినిధులు పాల్గొన్నారు.

నామినేషన్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు, వారి ప్రతినిధులు

మద్యం షాపు వద్ద నిరసన తెలుపుతున్న పలు పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, సభ్యులు

మద్యం షాపు తరలించాలని నిరసన

ప్రజాశక్తి- బొబ్బిలి

జనావాసాలకు దూరంగా మద్యం షాపును తరలించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు డిమాండ్ చేశారు. మేదరబంద జంక్షన్ లో ఏర్పాటు చేసిన మద్యం షాపును నివాసాలకు దూరంగా తరలించాలని కోరుతూ మంగళవారం మద్యం షాపు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బజారులో ఏర్పాటు చేసిన మద్యం షాపును జన నివాసలకు దూరంగా తరలించాలని ప్రజలు ఆందోళన చేస్తే 10మీటర్లు దూరంలో ఉన్న మేదరబంద జంక్షన్‌లో షాపు పెట్టడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. మద్యం షాపు వేరే చోటకు తరలిస్తామని ఎమ్మెల్యే బేబినాయన ఆదేశిస్తే పక్కకు తరలించడం చూస్తే ఎమ్మెల్యే మాటకు ఏమి విలువ ఇచ్చినట్లు అని ప్రశ్నించారు. మద్యం షాపును జన నివాసాలకు దూరంగా తరలించాలని, లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మద్యంషాపు పెట్టడంతో బజారు, మేదరబంద జంక్షన్‌లో మందుబాబులు గొడవలు చేస్తున్నారని, మహిళలకు, బాలికలకు రక్షణ లేదని అన్నారు. మద్యం షాపు తరలించి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.గోపాలం, రామభద్రపురం మండల కార్యదర్శి బి.శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ఎం.శ్రీనివాస్, మహిళలు, పలు పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

గడువులోగా వినతులు పరిష్కరించాలి

అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే వినతులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. ఆర్‌డిఒలు, తాహశీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బందితో మంగళవారం తమ ఛాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రీవెన్స్ వినతుల పరిష్కారంపై సమీక్షించారు. పిజిఆర్ఎస్‌కు వచ్చే వినతుల పరిష్కారంలో అంత జాప్యం ఎందుకు జరుగుతోందని కలెక్టర్ ప్రశ్నించారు. వచ్చిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి, పూర్తిస్థాయి పరిష్కారం చూపాలని ఆదేశించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం చేస్తున్న తాహశీల్దార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం విధించిన నిర్ణీత గడువుకు పదిరోజుల ముందుగానే ఆ సమస్యను పరిష్కరించి, తమకు నివేదిక పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కేంద్రం నుంచి డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి పాల్గొన్నారు.

సికిల్ సెల్ వ్యాధిపై సిటియులో సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గిరిజన యూనివర్శిటీలో సికిల్ సెల్ వ్యాధివల్ల కలిగే నష్టాలు, జీవన నాణ్యత అంశాలపై మంగళవారం సమావేశం జరిగింది. ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల శ్రీదేవి సికిల్ సెల్ వ్యాధిపై జాతీయ టాస్క్‌ఫోర్స్ ప్రాజెక్ట్ కోసం ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్, ప్రభుత్వం యొక్క సామాజిక-ప్రవర్తనా విభాగం నిధులు సమకూర్చింది. దేశంలోని వివిధ మూలల నుండి వచ్చిన నిపుణులను స్వాగతించారు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.వి.కట్టిమణి మాట్లాడుతూ దేశ జనాభాలో మెరుగైన ఎస్‌సిడి స్క్రీనింగ్, సంరక్షణ కోసం 2021లో సికిల్ సెల్ మిషన్‌ను ప్రారంభించారని తెలిపారు. జోధపూర్‌కు చెందిన డాక్టర్ బొంత వి.బాబు సికిల్ సెల్ రోగులలో కళంకాన్ని తగ్గించే వ్యూహాలపై కీలకమైన ప్రసంగం చేశారు. నిపుణులు, డాక్టర్. ఎన్ జనార్ధన, సైకియాట్రిక్ సోషల్ వర్క్ ప్రొఫెసర్, నిమ్హాన్స్, బెంగళూరు, డాక్టర్ రాహుల్ షిధాయే, సైకియాట్రీ ప్రొఫెసర్, ప్రవర ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, డాక్టర్ మెర్సియన్ డేనియల్ జార్జ్ తదితరులు ప్రసంగించారు.

మాట్లాడుతున్న అధికారులు

ప్రభుత్వ ధనాన్ని కాపాడాలి

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ఆబాద్‌వీధి ఉర్దూ బాలికల ప్రాథమిక పాఠశాలలో బినామి పేరుతో గత మూడేళ్ల నుంచి ఆయా జీతాన్ని ఆ స్కూలు హెచ్ఎం, అదే ప్రాంగణంలోని ఆయా కలసి డ్రా చేసి ఇద్దరూ పంచుకొని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు డిఇఒకు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసి ఆ ధనాన్ని రికవరీ వేసి తగిన క్రమ శిక్షణ చర్యలు తీసుకొవాలని కోరారు. ఈ పాఠశాలలో గత మూడు సంవత్సరాలుగా ఆయా పోస్టు ఖాళీగా ఉంది. పాఠశాల హెచ్ఎం, మరో ఆయా కలిసి కమ్మక్కయి బినామీ పేరుతో జీతాన్ని డ్రాచేసుకొని ఇద్దరూ పంచుకుంటున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆయా పోస్టు గురించి అడిగితే ఖాళీ లేదని చెబుతున్నారు. ఈనేపథ్యంలో వారిపై స్థానికులు ఫిర్యాదు చేశారు.

వికలాంగులకు ట్రైసైకిళ్లు మంజూరు

ప్రజాశక్తి-విజయనగరంకోట

అంగవైకల్యంతో బాధ పడుతూ నడవడానికి ఇబ్బంది పడుతున్న ఇద్దరు వికలాంగులకు జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ట్రైసికిళ్లను మంజూరు చేసింది. భోగాపురానికి చెందిన బమ్మిడి పాపారావు, నెరెడ్ల కామేశ్వరావు ఇటీవల జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భోగాపురంలో పర్యటించిన సమయంలో తమకు ట్రైసైకిళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తి మేరకు, ఇద్దరికీ ట్రైసైకిళ్లను మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు వారికి రెండు ట్రైసికిళ్లు మంజూరయ్యాయి.

వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, గ్రంథాలయ కార్యదర్శి, డిపిఆర్ఒ

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గురజాడ కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్నారు. వారోత్సవాలను కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ మంగళవారం తన ఛాంబరులో ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా 14న బాలల దినోత్సవంగా, 15న మాదకద్రవ్యాలపై అవగాహన - పుస్తక పఠన ప్రాముఖ్యతపై కార్యక్రమాలు, 16న గ్రంథాలయ ఉద్యమ ప్రముఖులను స్మరించుకొనే కార్యక్రమాలు, 17న కవి సమ్మేళనాలు, సెమినార్‌లు, రచయితల సందేశాలు, 18న పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి తెలిపారు. 19న మహిళలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. 20న డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డిపిఆర్ఒ డి.రమేష్, గ్రంథాలయ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలోని 49వ డివిజన్ గాజులరేగ ప్రాంతంలో కమిషనర్ పి.నల్లనయ్య పర్యటించారు. సకాలంలో నీటి సరఫరా జరుగుతోందా లేదా అని ఆ ప్రాంతంలో ఉన్న మహిళలను అడిగి తెలుసుకున్నారు. రోజు విడిచి రోజు నీటి సరఫరా జరుగుతోందని మహిళలు బదులిచ్చారు. ఆ ప్రాంతంలో ఉన్న రెండు వాటర్ ట్యాంకులను పరిశీలించాలని, అవసరమైతే మరమ్మత్తులను తక్షణమే చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా చూడాలన్నారు. అవసరమైతే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. వీధి కుక్కల సంచారం ఎక్కువగా ఉండడాన్ని గమనించి వాటికి ఏంటి రేబిస్ వ్యాక్సిన్లు వేయించడంతోపాటు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేయించాలని ప్రజారోగ్య సిబ్బందికి ఆదేశించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది టీమ్‌లుగా ఏర్పడి తరచూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తే స్థానిక సమస్యలు తెలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో టిపిఆర్ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, డిఇలు, పారిశుధ్య పర్యవేక్షకులు, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

పోస్టర్ ఫ్రీ నగరానికి సహకరించండి

పోస్టర్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దేందుకు చేస్తున్న తమ ప్రయత్నంలో ప్రజలు కూడా సహకారం అందించాలని కమిషనర్ నల్లనయ్య తెలిపారు. నగరంలో విచ్చలవిడిగా పోస్టర్లు, గోడ రాతలు చేపడుతున్నారని ఎన్నిసార్లు హెచ్చరించినా బేఖాతరు చేస్తున్నారని తెలిపారు. ప్రతిరోజు అనుమతులు లేని ఫ్లెక్సీలను, పోస్టర్లను తమ సిబ్బంది తొలగించి వేస్తున్నారని తెలిపారు. అయినా కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ గోడ రాతలు పోస్టర్లను అతికించడాన్ని సహించబోమని స్పష్టం చేశారు.

కుళాయి బకాయిలు చెల్లించండి : కమిషనర్

విజయనగరం వ్యాప్తంగా కుళాయి పన్ను బకాయిలను తక్షణమే చెల్లించాలని, లేనిపక్షంలో కనెక్షన్లను తొలగిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. కుళాయి పన్నులు వసూలుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని, దీని ప్రకారం ప్రత్యేక డ్రైవ్ ను చేపట్టి కుళాయి పన్నుల వసూళ్లకు సిబ్బందిని ఏర్పాటు చేసామన్నారు. ఎంతో వ్యయంతో నీటి సరఫరా పంపిణీ చేపడుతున్నామని ఈ క్రమంలో ఆర్థిక భారం కాకుండా ప్రజలకు కూడా సహకరించి కుళాయి పన్నులను తక్షణమే చెల్లించాలని తెలిపారు.

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ పి.నల్లనయ్య

వక్ఫ్ భూములు కాజేసేందుకు ప్రభుత్వం కుట్ర

ప్రజాశక్తి-విజయనగరం కోట

వక్ఫ్ బోర్డు భూములను లాక్కోవడానికి ప్రభుత్వం చూస్తుందని ఎపిసిసి మైనార్టీ విభాగం మాజీ వైస్ చైర్మన్ ఎమ్‌డి హుస్సేన్ షరీఫ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణ బిల్లు పేరుతో ముస్లిములు త్యాగం చేసిటువంటి లక్షల ఎకరాల భూములను, లక్షల కోట్ల ఆస్తులను జప్తు చేసుకునే దురుద్దేశంతో అడుగులు వేస్తుందన్నారు.. చట్ట సవరణ పేరుతో ముస్లిముల అధీనం నుంచి వాటిని లాక్కొని, వాటిపై ఏమాత్రం హక్కు లేకుండా చేసి, వాటిని బడాబాబులకు అప్పనంగా అప్పజెప్పే కుట్ర జరుగు తోందన్నారు. వక్ఫ్ బోర్డును ఎలాగైనా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అబ్దుల్ కరీం, ఎస్‌కె ఖలీల్, అబ్దుల్ రెహమాన్, సమీర్, మక్బుల్. తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న కాంగ్రెస నాయకులు హుస్సేన్ షరీఫ్

జనసేనలో చేరిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం కార్పోరేషన్ పరిధిలోని 34వ డివిజన్ ఇందిరానగర్ కు చెందిన ముడసల శ్రీనివాసరావు, గెద్ద రాముసాయుడు, వాసుదేవ తరుణ్ తేజల ఆధ్వర్యంలో 35 కుటుంబాలు అవనాపు విక్రమ్ సమక్షంలో మంగళవారం జనసేన పార్టీలో చేరారు. విక్రమ్ వారందరికీ పార్టీ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అవనాపు విక్రమ్ మాట్లాడుతూ అధికారం కోసం కాకుండా సిద్ధాంతాలు, ఆశయాలు కోసం పోరాడే వ్యక్తి పవన్ కల్యాణ్ అని అన్నారు. . ప్రజాస్వామ్య బద్ధంగా అర్హులందరికీ ప్రభుత్వం అందించే సహకారం అందేలా చూస్తారన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పుప్పల అప్పలరాజు, తురాల శ్రీనివాసరావు, పత్తిగిల్లి వెంకట్రావు, సంపత్ రాజు, షేక్ మారేశ్, టి.రామకష్ణ(బాలు), పిడుగు సతీష్,ఎర్నింటి నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

భూములను పరిశీలిస్తున్న అధికారులు

భూములను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - బాడంగి

బాడంగి మండల సమీపంలో ఉన్న పాత బ్రిటీష్ వారి ఎయిర్ పోర్ట్ భూములను మంగళవారం విశాఖపట్నం ఎన్ఎడి అధికారులు, బొబ్బిలి ఆర్డిఒ రామ్మోహన్ రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నేవీలో యుద్ధానికి సంబంధించిన సామగ్రిని దాచేందుకు నిల్వ కేంద్రం నిర్మాణానికి 1800 ఎకరాలు అవసరమని స్థల పరిశీలన చేస్తున్నామని చెప్పారు. మొత్తం భూమిని పరిశీలన చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుభాకర్, డిటి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - బొబ్బిలి

ఎఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా మాజీ నాయకులు ఒమ్మి రమణ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను సుదీర్ఘంగా ఈ మహాసభల్లో చర్చించి ఉద్యమాలకు సన్నద్ధమవుతామన్నారు. ఈ మహాసభలు నవంబర్ 27 నుంచి 30 వరకు విజయనగరంలో నిర్వహిస్తామని ఇందులో భాగంగా 27న బహిరంగ సభ, విద్యార్థుల ప్రదర్శన భారీ ఎత్తున జరుగుతుందని ఈ బహిరంగ సభకు ఎఐఎస్ఎఫ్ ఆలిండియా నాయకత్వం పాల్గొంటుందని విద్యార్థులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషణం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజశేఖర్, రవికుమార్, ఉపాధ్యక్షులు బి.దుర్గా ప్రసాద్, హరికృష్ణ, వికాస్, మండల డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల అప్పలనాయుడుకు మద్దతుగా మాట్లాడుతున్న టిడిపి నాయకులు

కోళ్లకు సముచిత స్థానం కల్పించాలి

ప్రజాశక్తి- సంతకవిటి

టిడిపి సీనియర్ నాయకులు కోళ్ల అప్పలనాయుడుకు అధిష్టానం సముచిత స్థానం కల్పించాలని టిడిపి నాయకులు, కార్యకర్తలు డిమాండ్చ చేశారు. ఇటీవల కూటమి ప్రభుత్వం విడుదల చేసిన నామినేటెడ్ పదవుల్లో కోళ్ల అప్పలనాయుడుకు అధిష్టానం తగు గుర్తింపు ఇవ్వకపోవడంతో బీసీ నాయకులు మంగళవారం రాజాం నటరాజ్ కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కోళ్ల అప్పలనాయుడు సంతకవిటి మండల ఎంపిపి ఐదు సార్లు, జెడ్పిటిసిగా పనిచేసి సంతకవిటి మండలాన్ని టిడిపికి కంచుకోటలాగా మార్చి నియోజకవర్గంలో ఎమ్మెల్యే గెలుపులో కీలక పాత్ర వహించారని అటువంటి వ్యక్తికి రాష్ట్ర స్థాయి రాజకీయాలలో తగిన గుర్తింపు లభించకపోవడం శోచనీయమని అన్నారు. ఇప్పటికైనా అధిష్టానం గుర్తించి కోళ్ల అప్పలనాయుడుకు సముచిత స్థానం కల్పించాలని నాయకులు కోరారు.

అంబేద్కర్ విగ్రహానికి 104 సిబ్బంది వినతి

పజాశక్తి- శృంగవరపుకోట

అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్నిస్తున్న ఉద్యోగులు

తమ డిమాండ్లు పరిష్కరించాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి మండలంలోని కొట్టం పిహెచ్సి పరిధిలో గల 104 వాహన సిబ్బంది మంగళవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమకి నెల నెల సక్రమంగా జీతాలు చెల్లించక కుటుంబాలను పోషించటం చాలా కష్టం మారుతోందన్నారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా కేవలం 50 వేలు రూపాయల ఖర్చుతో నిర్వహించి ప్రజా దనం వృథాకాకుండా చూడాలన్నారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డిఇఒకు జిఒ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పి.ఎఫ్ తిరిగి చెల్లించాలని, 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగులు డ్రైవర్లు జి, కోటారావు, బి.మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ తల్లి పండగ

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని పోలిపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి బంగారమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పోలిపల్లి, లింగాలవలస, బంగార్రాజుపేట, మోదవలస, వల్లూరు తదితర గ్రామాల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఎన్నుపోతుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పండగలో రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, మండల టిడిపి అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, పార్లమెంటరీ కార్యనిర్వహణ కార్యదర్శి కర్రోతు రాజు తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి ఆలయం వద్ద అన్నదానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు నెలరోజులు పాటు అత్యంత వైభవంగా జరిగిన సంగతి విదితమే.ఉత్సవాలు ముగిసిన తదుపరి కార్తీక మాసం రెండో మంగళవారం మూడు లాంతర్లు దరి చదురు గుడి వద్ద దేవస్థానం ఇఒ డివివి ప్రసాదరావు పర్యవేక్షణలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు బంటుపల్లి వెంకటరావు ఆధ్వర్యాన పైడితల్లి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలునిర్వహించారు. మధ్యాహ్నంఅమ్మవారికి నివేదన అనంతరం అమ్మవారి ప్రసాదంగా భారీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఇఒ ప్రసాదరావు, రోటరీక్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్, ప్రముఖ వైద్యులు ఎం.వెంకటేశ్వరరావు, పద్మకుమారి దంపతులు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు బంటుపల్లి వెంకటరావు భక్తులకు వడ్డించారు. .ఈకార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

భోగాపురంలో బంగారం చోరీ

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం గ్రామంలోని కొమ్మూరు వీధిలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. పావు తక్కువ మూడు తులాలు బంగారం చోరీ అయినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొమ్మూరు శారద అనే మహిళ కంటి ఆపరేషన్ నిమిత్తం వారం రోజుల కిందట విశాఖపట్నం వెళ్ళింది. మంగళవారం ఉదయం తాళం పగిలగొట్టి ఇంటి తలుపులు తీసి ఉండడంతో స్థానికులు ఆమెకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె విశాఖపట్నం నుంచి వచ్చి ఫిర్యాదు చేశారు. సిఐ ప్రభాకర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం తెప్పించి వేలిముద్రలను సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని కౌలువాడ గ్రామంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తి పై ఎక్సైజ్ శాఖ అధికారులు మంగళవారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన పిన్నింటి శ్రీను బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నారనే సమాచారంతో దాడి చేసి ఆయన వద్ద 30 మద్యం సీసాలు లభించడంతో కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది సత్యనారాయణ, ప్రతాప్, పాల్గొన్నారు.

ప్రణాళికపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

పంచాయతీల ప్రణాళికలపై పంచాయతీ కార్యదర్శులకు తప్పనిసరిగా అవగాహన ఉండాలని జెడ్పి సిఇఒ బివి సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ పంచాయతీల అభివృద్ధి వార్షిక ప్రణాళిక 2025-26పై పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. జెడ్పి సిఇఒ బివి సత్యనారాయణ ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ప్రణాళికపై అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిక్షణాధికారి ఎ.దేవుడు, ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు, ఇఒపిఆర్డి శంకర జగన్నాద్, అడ్మినిస్ట్రేషన్ అధికారి పి.సుదర్శన్, మండల అధికారులు, గ్రామ ఐక్య సంఘ ప్రెసిడెంట్లు, ఎంఎల్టిలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: గ్రామాభివృద్ధి ప్రణాళికపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రామకృష్ణ మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి అవసరమైన ప్రణాళిక ఎలా తయారు చేయాలి? ఇందులో ఇమిడి ఉన్న అంశాలను వివరించారు. విపిఆర్పి ప్రణాళిక విఒఎ పాత్ర గురించి తెలియజేశారు. ఆర్థిక వనరుల సమీకరణ, స్వంత ఆదాయ వనరుల అభివృద్ధి వంటి అంశాలను వివరించారు.

రేగిడి: మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్యామలకుమారి

రేగిడి: ప్రణాళికలతోనే గ్రామ పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేయాలని ఎంపిడిఒ శ్యామల కుమారి, ఇఒపిఆర్డి ఎవి సత్యనారాయణ సూచించారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ సమాఖ్య విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025-26 ఏడాదికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సాధారణ నిధులతో గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు చేపట్టాలన్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గంతో పాటుగా ప్రజలను భాగస్వాములు చేసి అభివృద్ధి ప్రణాళికలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా సంకిలి పంచాయతీ కార్యదర్శి కూర్మా రావు, మరి కొంతమంది గ్రామ పంచాయితీల అభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎంఇఒ ఎం.వర ప్రసాద్ రావు, ఎపిఎం బాసిన గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పి సిఇఒ సత్యనారాయణ

నెల్లిమర్ల: మాట్లాడుతున్న జెడ్పి సిఇఒ సత్యనారాయణ

16న జనవాణి కార్యక్రమం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఈనెల 16వ తేదీన కూటమి ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి వబ్బిన సత్యనారాయణ జనసేన మండల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్కె గ్రాండ్ ఫంక్షన్ హాల్లో నిర్వహించబోయే జనవాణి కార్యక్రమంలో పాల్గొంటారని జనసేన మండల నాయకులు తాండ్రంగి చంటి, మోపాడ చిన్న, పెనుమత్స సురేష్రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో అభివృద్ధి, సంక్షేమానికి సంభందించి అర్జీలు స్వీకరించడంతోపాటు పింఛన్లు, ఇంటి స్థలం, స్థానిక సమస్యలపై దరఖాస్తు స్వీకరించి ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, జనసేన నియోజకవర్గ ఇంఛార్జి వబ్బిన సత్యనారాయణ ఆధ్వర్యంలో సంబందిత అధికారులకు పంపిస్తామని చెప్పారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కరెంట్ బిల్లు, పాస్ ఫోటో, చిరునామాతో ఫోన్ నెంబర్ వివారాలు జెరాక్స్ కాపీలు మూడు సెట్లు తీసుకుని రావాలని కోరారు.

అపరాల సాగుపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

అపరాల సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ శాఖ ఎడిఎ యం.శ్యాంసుందర్ రైతులకు సూచించారు. మంగళవారం పక్కి, కృష్ణాపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానంగా అపరాల పంట దిగుబడి పెంపుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ ప్రాంతాలలో అపరాలు దిగుబడి అత్యల్పంగా ఉండటం వల్ల దాన్ని దిగుబడులు పెంచుకోవడానికి తీసుకోవలసిన మూడు సూచనలు సలహాలు ఇచ్చారు. కలుపు నివారణ, ముఖ్యంగా పంట వేసిన తర్వాత పంట రెండూ లేదు మూడు ఆకుల దశలో ఉన్నప్పుడు మందు పిచికారి చేయాలన్నారు. ఈ కలుపు మందులో ప్రధానంగా ఇమ్మజత ఫైర్ లేదా ఐరిస్ అనే కలుపు మందును ఎకరానికి పావు లీటరు లేదా 400 ఎంఎల్ చొప్పున పిచికారి చేసుకోవాలన్నారు. ఐదు నుంచి 6 ఆకులు దశలో యూరియా ద్రావణాన్ని ఒక ట్యాంక్కు అరకేజీ చొప్పున స్ప్రే చేసుకుంటే పంటకు అవసరమైన పోషకాలు, తేమని అందించి పంట ఆరోగ్యంగా ధృఢంగా రావడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ విధంగా కలుపు నివారణ ప్రధానంగా చేపడితే కనీసం క్వింటా నుంచి రెండు క్వింటాల వరకు దిగుబడి పెరగడానికి ఆస్కారం ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపురం సర్పంచ్ సింహాచలం వ్యవసాయ సహాయకులు నాయుడు, వెంకటరమణ, సుస్మిత పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని కోడూరు, అచ్చియ్యపేట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయధికారి కె.శిరీష ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపరాలు పంటలో కలుపు నివారణకు 20రోజులు సమయంలో ఇమాజిత్ ఫైర్ -250 ఎంఎల్ ఎకరానికి చొప్పున పిచికారీ చేసుకోవాలన్నారు. దీని వల్ల అపరాలలో కలుపుని సమర్థవంతంగా నివారించుకోవొచ్చు అని తెలిపారు. 25రోజులు సమయంలో చేను పెరగడానికి 5శాతం యూరియా ద్రావణం లేదా 19-19-19 పొడి 5శాతం లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని దీంతో పాటు వేప నూనె కలిపి వాడినట్లయితే మొదటి దశ చీడపురుగులు అదుపులో ఉంటాయని తెలిపారు.

బొబ్బిలిరూరల్: రైతులకు సూచనలు చేస్తున్న ఎడిఎ శ్యాంసుందర్

డబ్బులిచ్చి మోసపోయాం

ప్రజాశక్తి - భోగాపురం

చెక్కులు, ప్రామిసరీ నోట్లను చూపిస్తున్న బాధితులు

ప్లాట్లు నిర్మించి ఇస్తానని నమ్మించి తమ దగ్గర నుంచి లక్షల రూపాయలు నారు అప్పలరాజు అనే వ్యక్తి కాజేసారని బాధితులు ఆరోపించారు. గతంలో ఎల్ఐసిలో డెవలప్మెంట్ ఆఫీసర్గా పనిచేసిన జామి వెంకట నాగరాజు, విజయనగరానికి చెందిన కృష్ణవేణి, రఘుమండ గ్రామానికి చెందిన నానాజీలు భోగాపురంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి చెందిన నారు అప్పలరాజు అనే వ్యక్తి తమ దగ్గర నుంచి కొత్తగా జమ్మునారాయణపురంలో ఫ్లాట్ నిర్మించి ఇస్తానని చెప్పాడన్నారు. ఇది నమ్మి తాము ముగ్గరం కలిపి రూ.21 లక్షలు అతనికి చెల్లించామన్నారు. తీరా చూస్తే తమకు ఇస్తామన్న ప్లాట్లు తమకు తెలియకుండా వేరొకరికి అమ్మేసాడని ఆరోపించారు. ఈ విషయమై అప్పలరాజును అడగగా డబ్బులు ఇస్తానని నమ్మించి పది సంవత్సరాల నుంచి తిప్పుతున్నారని, గట్టిగా అడిగితే ఎవరికీ చప్పుకుంటారో చెప్పుకోండి అని బెదిరిస్తున్నాడని వాపోయారు. అతను ఇచ్చిన ప్రామిసరీ నోట్లు, బ్యాంకు చెక్కులు తమ వద్ద ఉన్నాయన్నారు. విజయనగరం రూరల్ పోలీస్, డెంకాడ స్టేషన్ ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తామె కాకుండా ఇంకా చాల మంది అతని చేతిలో మోసపోయారని ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోంది : బొత్స

ప్రజాశక్తి- గజపతినగరం

కూటమి ప్రభుత్వం ఆచరణ సాధ్యం కానీ హామీలతో ప్రజలను నమ్మించి, అధికారంలోనికి వచ్చిన తర్వాత ఆ హామీలు అమలు చేయకుండా మోసం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య విమర్శించారు. మంగళవారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోనికి రావడం కోసం చంద్రబాబు తమకన్నా మెరుగైన హామీలు ఇచ్చారన్నారు. వాటిని ప్రజలు నమ్మి కూటమికి అధికారం కట్టబెట్టారన్నారు. తాజాగా సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్లో ప్రజల ఆశలను అడియాశలు చేశారన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేసేందుకు ఏ యొక్క పథకానికి నిధులు కేటాయింపులు బడ్జెట్లో కనిపించలేదన్నారు. నిరుద్యోగ భృతి ఊసే లేదన్నారు. 53.58 లక్షల మంది రైతులకు రైతుబంధు కింద సుమారు రూ.10వేల కోట్లు అవసరం కాగా 1000 కోట్లు మాత్రమే కేటాయించడం మోసం కాదా అని ప్రశ్నించారు. ఉచిత గ్యాస్ లబ్ధిదారులు రాష్ట్రంలో 1.59 లక్షల మంది ఉండగా, ఇందుకుగాను రూ.4వేల కోట్లు అవసరం కాగా, రూ.800 కోట్లు మాత్రమే కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కేటాయింపు ఒక సిలిండర్ సబ్సిడీకి మాత్రమే సరిపోతుందన్నారు. మిగతా రెండు సిలిండర్ల సబ్సిడీ మొత్తం ఏ విధంగా చెల్లిస్తారని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు సర్వీసు అమలకు గాను అవసరమైన కేటాయింపులు బడ్జెట్లో లేవన్నారు. మహిళలకు 18 వేల రూపాయలు, తల్లికి వందనం సంగతి ఊసే లేదన్నారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని, లేని పక్షంలో తమ పార్టీ ప్రజల పక్షాన నిలబడి క్షేత్రస్థాయిలో పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, సర్పంచులు బెల్లాన త్రినాధరావు, కె పైడిపునాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, సోషల్ మీడియా ఇన్చార్జ్ పిఎస్ఎన్ మూర్తి, ఉపసర్పంచ్ కర్రీ రామ్నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను తప్పదోవ పట్టించొద్దు : టిడిపి

ప్రజాశక్తి- గజపతినగరం

మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ప్రజలను తప్పుదోవ పట్టించే మాటలు మానుకోవాలని, నిర్మాణాత్మకమైన సలహాలు ఇవ్వాలని నియోజవర్గ టిడిపి నాయకులు, రాష్ట్ర కార్యదర్శి పివివి గోపాలరాజు, మాజీ ఎంపిపిలు మక్కువ శ్రీధర్, గంట్యాడ శ్రీదేవి హితవు పలికారు. మంగళవారం వారు స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముందుగా గోపాలరాజు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే అప్పల నరసయ్య చేత నీతులు చెప్పించుకునే దౌర్భాగ్య స్థితిలో తమ పార్టీ లేదన్నారు. అనుభవ రాహిత్యం అంటే ఏమిటో అప్పల నరసయ్య చెప్పాలన్నారు. దానిని సరి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో శ్రమిస్తున్నారన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత దూషణలు, కించపరిచే విమర్శలు చేయడం సరికాదని, అటువంటి వారినే తమ ప్రభుత్వం అరెస్టు చేస్తుందన్నారు. ఇందులో అక్రమ అరెస్టులు అంటూ ఏమీ లేవన్నారు.

మక్కువ శ్రీధర్ మాట్లాడుతూ కాపు సమాజాన్ని కించపరిచే వారిని, మహిళలపై అసభ్యకర పోస్టులు పెట్టే వారిని అరెస్టులు చేస్తే, అక్రమ అరెస్టులు ఎలా అవుతాయని ప్రశ్నించారు. గజపతినగరం నియోజకవర్గంలో ఎక్కడైనా వైసిపి నాయకుల అరెస్టులు జరిగాయా అంటూ ప్రశ్నించారు. ఇటువంటి వారిని మాజీ ఎమ్మెల్యే అప్పల నరసయ్య ప్రోత్సహించడం విడ్డూరంగా ఉందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇంకా ఐదు నెలలు మాత్రమే అయిందని డిగ్రీ కళాశాల పనులు కూడా చేసే దిశగా అడుగులు వేస్తున్నామని గుర్తు చేశారు. జిల్లాలో ఒకప్పుడు మద్యం వ్యాపారంలో చక్రం తిప్పిన మీ కుటుంబం, కొండపల్లి కుటుంబంపై బురద జల్లడం సరైంది కాదన్నారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్, కొండపల్లి భాస్కరరావు, కోరాడ కృష్ణ, రాంజీ రాజు, వైకుంఠం ప్రదీప్ కుమార్, లెంక బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు: సిఐ

ప్రజాశక్తి - వంగర

గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు, నాటు సారా వంటివి ఎవరైనా నిర్వహిస్తే చర్యలు చేపడతామని రాజాం రూరల్ సిఐ హెచ్ ఉపేంద్ర రావు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ను ఆయన మంగళవారం పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఎస్ఐ షేక్ శంకర్తో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించి తగు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమానులపై చర్యలు చేపడతామన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా తెలియనటువంటి వ్యక్తులు బ్యాంకు ఆధార్, ఒటిపి తదితర వివరాలు అడిగితే జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ మేరకు మండలంలోని సంగాంలో ఆయన పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వంగర: మహిళా పోలీసులతో మాట్లాడుతున్న సిఐ ఉపేంద్రరావు

షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

రేగిడి: దుకాణ యజమానులు షాపుల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ పి.నీలావతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఉంగరాడ మెట్ట షాపు యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. దుకాణాల వద్ద వ్యర్థ పదార్థాలతో అపరిశుభ్రత ఏర్పడి ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. చెత్తాచెదారాన్ని దూరంగా పారవేయాలన్నారు. హోటల్ యజమానులు రోడ్డుపైనే కడిగిన నీరు వదలడంతో రోగాలు వస్తున్నాయన్నారు.

ఆయుష్తోనే దీర్ఘకాలిక రోగాలు మాయం

ప్రజాశక్తి- గరివిడి

ఆయుష్తోనే దీర్ఘకాలిక రోగాలు మాయమవుతాయని, డయాబెటీస్ను ఆయుష్ సేవల ద్వారా నయం చేయవచ్చుని ఆయుష్ హోమియోపతిక్ వైద్యాధికారి డాక్టర్ డి. వెంకటమధు అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంఎల్పిహెచ్, ఆశా కార్యకర్తలతో ఆయన మాధమేహం వ్యాధిని నియంత్రయించే విధానంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయాబెటీస్ వ్యాధిని ఆయుష్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో అందిస్తోన్న వైద్య సేవల ద్వారా ఎలా అదుపులో ఉంచుకోవచ్చుని తెలిపారు. ఆయుష్ అంటే ఆయుర్వేదం, యోగా అండ్ ప్రకృతి వైద్యం, యునాని, సిద్ధ, హోమియోపతి అని నిర్వచించారు. ప్రభుత్వం ఈ ఆయుష్ శాఖా ఆధ్వర్యంలో అందిస్తున్న ఐదు రకాల వైద్య విధానాల ద్వారా ఎటువంటి అల్లోపతిక్ మందులు వాడకుండా మధుమేహం వ్యాధిని సునాయాసంగా అదుపులో పెట్టుకోవచ్చన్నారు. జీవన శైలీలో మార్పులతో పాటు ఒత్తిడి గల దైనందిన జీవితంలో అబలా గోపాలం మధుమేహం వ్యాధి బారిన పడుతున్నారన్నారు. డయాబేటీస్ వ్యాధి బారిన పడిన వెంటనే ఇంగ్లీషు మందులు వాడటం వల్ల ఒక పక్క వ్యాధిని నియంత్రిస్తున్నప్పటికీ మరో పక్క నుండి ఇతర ఆరోగ్య దుష్ఫలితాలు సంభవిస్తుండటం పరిపాటి అన్నారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న ఐదు రకాల వైద్య విధానాల ద్వారా చికిత్స చేసుకుంటే వ్యాధిని నియంత్రించడంతోపాటు ఎటువంటి ఇతర దుష్ఫలితాలు రావని ప్రతి ఒక్కరూ ఆయుష్ శాఖ అందిస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఎమ్ఎల్పి హెచ్లు, ఆశా కార్యకర్తలు ప్రజలకు క్షేత్ర స్థాయిలో అందుబా టులో ఉంటారు కాబట్టి ఆయుష్ సేవలను ప్రజలకు చేరువేయడంలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుర్ల నేచురోపతి వైద్యాధికారిణి డాక్టర్ రజితారోయ్, గరివిడి పిహెచ్సి పరిధిలోని ఎంఎల్పిహెచ్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైద్యులు వెంకట మధు

జాకేరును సందర్శించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - వేపాడ

జాకేరు పంచాయతీలో జరుగుతున్న శానిటేషన్ సర్వేను, హౌస్ హోల్డ్ జియో లొకేషన్ సర్వేను, ఎన్పిసిఐ అప్డేషన్ను ఎంపిడిఒ సూర్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మరుగుదొడ్లు ఎన్ని ఉన్నాయి, ఎన్ని మరుగుదొడ్లు వాడుతున్నారు, ఇంకా మరుగుదొడ్లు నిర్మించుకోని వారు ఎంతమంది ఉన్నారు. గ్రామంలో బహిరంగ మలవిసర్జన జరుగుతుందా లేదా అనే విషయాలు సిబ్బంది తెలుసుకొని సర్వే సక్రమంగా చేయాలని సూచించారు. మరుగుదొడ్లను అందరూ ఉపయోగించుకోవాలని కోరారు. ఎవరు బహిరంగ మలవిసర్జన చేయకూడదని దీని వల్ల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ప్రజలకు తెలియజేశారు. అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

పాఠశాలను సందర్శించిన ఎంఇఒ

మండలంలోని జాకేరు ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఇఒ పి. బాలబాస్కరరావు మంగళవారం సందర్శించారు. ముందుగా పాఠశాల ప్రార్థనా నిర్వహణ, పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, టాయిలెట్స్, వంటగది, కిచెన్ గార్డెన్ను పరిశీలించారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రికార్డులను, టీచర్ డైరీ, లెసెన్స్ ప్లాన్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు. ఆర్. అప్పలసత్యం, ఉపాధ్యాయులు రామసత్యం, అప్పారావు, డి.కోటేశ్వరరావు, కె.రామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ బాలభాస్కరరావు

ఆధార్ కేంద్రం పరిశీలన

బక్కునాయుడు పేటలోని ఎపిఎస్ఆర్డబ్ల్యుఆర్ పాఠశాలలో ఏర్పాటు ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఎంఇఒ బాలభాస్కరరావు పరిశీలించారు. విద్యార్థుల ఆదార్ వివరాలను సరిచేసి అపార్లో నమోదు చేసేందుకు ఈ ఆదార్ సెంటర్ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

IDBI BANK

ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్
రిటైల్ రికవరీ, పైడా ఛాంబర్స్, 9-14-15, విఐపి రోడ్, సిరిపురం, విశాఖపట్నం-530003.

స్థిరాస్తి అమ్మకం ప్రకటన అనుబంధము-IV-A (రూల్ 9(1) ప్రకారం)

సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్మెంట్) రూల్సు, 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.
సెక్యూరిటైజేషన్ మరియు రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం **ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్,** అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు చట్టం నందలి రూలు 9(1) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా **ఋణగ్రహీత(లు)/హామీదారు(లు)** లకు నోటీసు ఇచ్చి తెలియజేయునదేమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి **భౌతిక స్వాధీనత** చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించినవిధంగా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించటమైనది. దిగువ స్థిరాస్తి **అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో అది", "ఎలా ఉన్నది అలా" మరియు "అక్కడ ఏది ఉంటే అది" ప్రాతిపదికన మెస్సర్స్ ఎస్.పి ట్రేడర్స్ (సంస్థ లేదా ఋణగ్రహీత), శ్రీ యమికే విజయరామ శరత్ వర్మ (యజమాని మరియు తనఖాదారు)** నుండి రావలసిన **బకాయి మొత్తము ది.31-05-2022 నాటికి రూ.21,32,876.07 పై. (అక్షరాల ఇరవై ఒక్క లక్షల ముప్పై రెండు వేల ఎనిమిది వందల డెభ్బైఆరు రూపాయలు మరియు ఏడు పైసలు మాత్రము) మరియు** తదుపరి జమకూడు వడ్డీ మరియు ఇతర ఖర్చులతో రాబట్టుకొనేందుకు **ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్ వారిచే** ఇ-వేలం" ద్వారా **ది.29-11-2024** న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించటమైనది. రిజర్వు ధర మరియు ఇఎండి డిపాజిట్ వివరములు ఈ క్రింది విధంగా.

స్థిరాస్తి వివరములు
విజయనగరం జిల్లా, విజయనగరం యస్ఆర్ఓ, విజయనగరం మునిసిపాలిటీ, వంటితాడి ఆగ్రహారం గ్రామము, యస్.నెం.115/7 నందు 244 చ॥గ॥లు స్థలమునకు సంబంధించిన ఆస్తికి హద్దులు: **తూర్పు:** ధరఖాస్తుదారు యొక్క మిగిలిన ఖాళీస్థలము, **పడమర:** శ్రీనాధ విజయలక్ష్మి యొక్క ఆస్థి, **ఉత్తరం:** ఉమ్మడి దారి, **దక్షిణం:** చెరువు. అన్ని కలుపుకొని మరియు ఒక్కటిగల నిర్మాణములు మరియు అందులోని ఎరెక్షన్, అన్ని ప్రస్తుత మరియు భవిష్యత్తో సహా ఆస్తి.

రిజర్వుధర : రూ.27,81,600/- ధరావత్తు సొమ్ము : రూ.2,78,160/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఈ-వేలం తేది & సమయం: 29-11-2024 ఉదయం 11 గం॥ల నుండి

బిడ్ డాక్యుమెంట్ల తేది	14-11-2024
బిడ్ డాక్యుమెంట్లు సమర్పించుటకు చివరి తేది	28-11-2024 సా॥ 4.00 గం॥ల వరకు
ఇఎండి సమర్పించుటకు చివరి తేది	28-11-2024 సా॥ 4.00 గం॥ల వరకు
తనిఖీ తేది	14-11-2024 నుండి 28-11-2024 వరకు అన్ని పనిదినములలో ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకూ

విక్రయమునకు సంబంధించిన నియమ నిబంధనల వివరములకు దయచేసి సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క వెబ్సైట్ అనగా https://www.idbibank.in నందు పొందుపరచబడిన లింక్ను సంప్రదించగలరు. వేలంలో పాల్గొనదలచినవారు ఇతర వివరాల కోసం శ్రీ విజయ్కుమార్ వూతాడ, డిజిఎం(ఫోన్: 8097001972, E-mail: v.vijaykumar@idbi.co.in) మరియు శ్రీమతి ప్రియాంక కోలియా, మేనేజర్ (ఫోన్: 9515812175, E-mail: priyanka.kholia@idbi.co.in) సంప్రదించగలరు.
ఇ-వేలంకు సంబంధించిన వివరాల కోసం కుమారి బి.ఎం. సుశ్మిత, మొబైల్: 8951944383, E-mail: sushmitha.b@antaressystems.com, Website: www.bankeauctionwizard.com, M/s ANTARES SYSTEMS LIMITED,"Honganasu", #137/3 బెంగళూరు మైసూరు రోడ్డు, మెట్రో పిల్లర్-పి696 ఎదురు, కెంగేరి, బెంగళూరు-560060 సంప్రదించగలరు.
తేది : 13-11-2024, ప్రదేశం : విశాఖపట్నం. సం/- అధీకృత అధికారి, ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్,